సాక్షి మంచిర్యాల

ఆదివారం, 10, ఆగస్టు, 2025

తండాల్లో తీజోత్సవం

గిరిజన గూడేల్లో శనివారం తీజ్ సందడి మొదలైంది. యువతులు బుట్టల్లో ఎర్రమట్టి నింపి అందులో గోధుమలు చల్లారు. తొమ్మిది రోజులపాటు నియమనిష్టలతో వివిధ కార్యక్రమాలు చేపడుతారు.

- వివరాలు 8లో▸



రాఖీ సంబరం



మొక్కకు రాఖీ కట్టిన రాజ్‌కుమార్, సోదరీమణులు



దండేపల్లి: కేజీబీవీలో వృక్షాలకు రాఖీ కట్టిన విద్యార్థినులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల గురుకుల పాఠశాలలో రాఖీలను చూపుతున్న ప్రిన్సిపాల్ మోహన్, అధ్యాపకులు

నస్పూర్/నెన్నెల: జిల్లాలో రాఖీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. నస్పూర్‌లో శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గని కార్మికుడు జాడి రాజ్‌కుమార్ తన అక్కాచెల్లెలు మమత, మల్లేశ్వరిలతో కలిసి మొక్కకు రాఖీ కట్టారు. పర్యావరణ పరిరక్షణ, ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలకు రక్షణగా ఉంటామని తెలియజేయడానికి రాఖీ కట్టినట్లు తెలిపారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు నెన్నెల మాజీ ఎంపీపీ రమాదేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సింగతి శ్యామల ఆయన నివాసంలో రాఖీ కట్ట శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నయ్య వారికి కానుకలు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.





చిన్నయ్యకు రాఖీలు కడుతున్న మహిళలు



భీమారం: అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



యశ్వంత్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు, మంచిర్యాల

సెల్ఫీ విత్ రాఖీ

రాఖీ పండుగ సందర్భంగా సెల్ఫీ విత్ రాఖీ పేరిట ఫొటోలను 'సాక్షి' ఆహ్వానించగా విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు రాఖీ వేడుకల ఫొటోలను పంపించారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸

న్యూస్‌రీల్

బస్టాండ్లలో పండుగ రద్దీ



బస్టాండ్‌లో గుమిగూడిన ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో శనివారం ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లు కిటకిటలాడాయి. రాఖీ పండుగ కావడంతో దూరప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో మంచిర్యాల బస్‌స్టేషన్ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. బస్సులన్నీ మహిళ ప్రయాణికులతో నిండిపోయాయి. బస్సు వచ్చిందంటే చాలు సీట్ల కోసం పరుగులు తీశారు. బస్సుల సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఇంకోవైపు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. హైదరాబాద్‌కు వెళ్లే బస్సులన్నీ ముందస్తు రిజర్వేషన్లతో నిండిపోయాయి. బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో బస్సులు నడిపినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు.

లాభాల వాటా ప్రకటించాలి



గని మేనేజర్ కోటయ్యకు వినతిపత్రం

జైపూర్: లాభాల వాటా ప్రకటించాలని ఇందారం ఐకే1ఏ గనిపై సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం గని మేనేజర్ కోటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐకే1ఏ పిట్ సెక్రెటరీ సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన లాభాలను వెంటనే ప్రకటించాలని, కార్మికులకు 35 శాతం లాభాల వాటా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సరం కార్మికులకు పంపిణీ చేయగా, మిగిలిన డబ్బులతో ఎంతమేరకు అభివృద్ధి చేశారో చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, ఖాదీర్ పాషా, వినయ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా దినోత్సవం

మంచిర్యాలటౌన్: క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసం వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సురిమిల్ల వేణు, మంచిర్యాల మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, లక్సెట్టిపేట్ టౌన్ అధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు రామగిరి బానేశ్, పూస్కూరి శ్రీనివాసరావు, ఖలీద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కాతో ఎస్సై స్వరూప్‌రాజ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాపల్లి స్టేజీ వద్ద శనివారం పోలీసుల తనిఖీల్లో భారీగా నిషేధిత గుట్కా పట్టుబడింది. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల వైపు వస్తున్న బొలేరో వాహనాన్ని అనుమానంతో తనిఖీ చేశారు. నిషేధిత గుట్కా బ్యాగులు గుర్తించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన 30బ్యాగుల గుట్కా విలువ సుమారుగా రూ.1.70 లక్షలు ఉంటుందని, గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, గంగాధర్, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

రెండింటికే అనుమతి..!




- జిల్లాలోనూ ఫెర్టిలిటీ సెంటర్లు
- పదికి పైగానే ఆస్పత్రుల నిర్వహణ
- 'సృష్టి' మోసంతో తనిఖీకి బృందాలు

మంచిర్యాలటౌన్: తల్లి కావాలన్న కలను సాకారం చేసుకునేందుకు పిల్లలు లేని దంపతులకు వరంగా మారాల్సిన సంతాన సాఫల్య కేంద్రాలు ప్రభుత్వ అనుమతి పొందకుండానే నిర్వహణ సాగిస్తున్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకే పరిమితమైన ఫెర్టిలిటీ సెంటర్లు జిల్లాలోనూ వెలుస్తున్నాయి. వీటి నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రం మంచిర్యాలలో రెండు ఆస్పత్రులకు మాత్రమే ఫెర్టిలిటీ అనుమతులు లభించగా.. అందులో ఒక ఆస్పత్రికి ఐవీఎఫ్(ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్), మరో ఆస్పత్రికి ఐయూఐ(ఇంట్రా యూటిరైన్ ఇన్‌సెమినేషన్) విధానానికి మాత్రమే అనుమతి లభించింది. మరో రెండు ఆస్పత్రులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా.. రాకముందే గత కొంతకాలంగా నిర్వహిస్తుండడం గమనార్హం. ఇవి కాకుండా 10కి పైగా గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రసూతి ఆస్పత్రుల ముందు సంతాన సాఫల్య కేంద్రం బోర్డులు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. ఆయా ఆస్పత్రులు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడం, కనీసం దరఖాస్తు కూడా చేయకుండానే ఆస్పత్రుల ముందు బోర్డులు ఏర్పాటు చేసి.. ఆస్పత్రి లోపల నోటీసు బోర్డులో మాత్రం ఐవీఎఫ్ సేవలు అందుబాటులో లేవని చిన్నపాటి అక్షరాలతో పెడుతున్నారు. సంతాన సాఫల్య కేంద్రం బోర్డులు చూసి పిల్లలు లేని దంపతులు ఎంతో ఆశతో ఆస్పత్రులకు వెళ్తే వారికి ప్రసూతి ఆస్పత్రుల్లో అందించే చికిత్స మాత్రమే అందిస్తున్నారు.

నగరాల్లోని ఆస్పత్రులతో కలిసి...

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లో వెలిసిన ఫెర్టిలిటీ ఆసుపత్రులకు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు వెళ్లేందుకు కొన్ని ఆస్పత్రులు సంతాన సాఫల్య కేంద్రాల బోర్డులను ఏర్పాటు చేసుకుని, ఆసుపత్రికి వచ్చిన దంపతులను నగరాల్లోని ఆసుపత్రులకు పంపిస్తున్నట్లు సమాచారం. ప్రతీ నెలలో ఒకరోజు ఉచిత కన్సల్టెన్సీల పేరిట నగరాలకు చెందిన ఫెర్టిలిటీ కేంద్రాల ఆధ్వర్యంలో శిబిరాలను సంతాన సాఫల్య కేంద్రాల పేరిట బోర్డులను ఏర్పాటు చేసిన ప్రసూతి ఆసుపత్రుల్లో నిర్వహించి, ఆయా దంపతుల వివరాలు సేకరిస్తున్నారు. వారికి మొదటగా వారి ఆసుపత్రుల్లోనే చికిత్స అందించడం, ఆ తర్వాత పిల్లలు కావాలంటే నగరంలోని ఆసుపత్రులకు పంపిస్తున్నారు. వీరికి జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు సైతం సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు గైనకాలజిస్టులు ఎలాంటి ఫెర్టిలిటీ నిర్వహణ అనుమతులు తీసుకోకుండానే, సంతాన సాఫల్య కేంద్రాలుగా చికిత్స అందిస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో అనుమతులు లేకుండా ఎలాంటి ఆసుపత్రిని నిర్వహించినా శాఖపరంగా చర్యలు తీసుకుంటాం. సంతాన సాఫల్య కేంద్రాలుగా నిర్వహించుకునేందుకు పూర్తిస్థాయి అనుమతులు తీసుకున్న తర్వాతనే ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించాలి. అనుమతులు తీసుకోకుండా బోర్డులు ఏర్పాటు చేసినా, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్యాధికారి

జిల్లాల్లో తనిఖీలు షురూ

ఇటీవల సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో జరిగిన మోసంతో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ఫెర్టిలిటీ సెంటర్లతోపాటు అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లో తనిఖీలకు టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది. ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో తనిఖీలు పూర్తి చేసింది. ఇక శుక్రవారం నుంచి జిల్లాల్లో తనిఖీలు మొదలు కాగా.. వరంగల్ జిల్లాలో తనిఖీలు చేశారు. మంచిర్యాల జిల్లాలో రెండింటికి మాత్రమే ఫెర్టిలిటీకి అనుమతులు ఉండగా, అనుమతులు లేకుండా పదికి పైగా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. అందులో మరో రెండు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని, రాకముందే నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆసుపత్రులకు అనుమతులు లేవు. పిల్లలు లేని దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫెర్టిలిటీ కేంద్రాలపై తనిఖీ బృందం చర్యలు తీసుకుంటుందా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

- గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నాయకులు

పాతమంచిర్యాల: అడవులనే ఆయువు పట్టుగా చేసుకుని జీవం సాగించే ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతోందని, విద్య, వైద్యం అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందని తెలిపారు. గిరిజన మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, జిల్లాలోని ప్రతీ గిరిజన ప్రాంతానికి రోడ్డు రవాణా వసతి కల్పించి ఆ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. నాయకులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గిరిజన బాలికలు కలెక్టర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి వైశ్య భవన్ సభా ప్రాంగణం వరకు ఆదివాసీ గిరిజనులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీటీడీవో జనార్దన్, ప్రోగ్రాం కన్వీనర్ అలం బాపు, గిరిజన నాయకులు జీక శేఖర్, అడ జంగు, సోయం జంగు, భార్గవ్, రాజ్‌కుమార్, పెంద్రం హన్మంతు, ఆత్రం రవీందర్, చిలుకయ్య, మడావి శంకర్, నైతం లక్ష్మణ్, గిరిజన సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న గిరిజన యువతులు



సంప్రదాయ నృత్యాలు చేస్తున్న యువతులు

సర్కారు జాగలో సౌర విద్యుత్

- ఖాళీ స్థలాలు, భవనాల వినియోగం
- సౌరపలకలు ఏర్పాటు చేసి ఉత్పత్తి
- వారంలో నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సర్కారు కార్యాలయాలు, జాగలు వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, భవనాల ఉపరితలాలపై సౌర పలకలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా అడుగులు వేస్తోంది. పర్యావరణహితంగా భవిష్యత్ అవసరాలకు విద్యుత్‌ను వాడుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వారం రోజుల్లో నివేదిక అందజేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రభుత్వ పరిధిలో ఉన్న భూముల వివరాలు మండల, గ్రామ స్థాయిల్లోని అధికారుల నుంచి వివరాలు తీసుకోనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సౌర విద్యుత్ పంపుసెట్లు సైతం బిగించనున్నారు.

వృథాగా అనేక స్థలాలు

ప్రభుత్వ కార్యాలయాల ఉపరితలాలు, ఖాళీ జాగలు ఎకరాల కొద్దీ వృథాగా ఉన్నాయి. పంచాయతీ, రెవెన్యూ, విద్యాసంస్థలైన స్కూళ్లు, కాలేజీలు, వసతిగృహాలు, ఆసుపత్రులు, అటవీ, పోలీసుస్టేషన్లు ఇతర కార్యాలయాల పరిసరాలు వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. కలెక్టరేట్ పరిసరాలతో మొదలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, రైతువేదికలు, పోలీసుస్టేషన్లు, అటవీ శాఖ కార్యాలయాలు, భూములు, సర్కారు జాగల్లో గ్రామాలు, పట్టణాల్లో అనేకం ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ భవనాలపై సౌరపలకలు బిగించి విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. విద్యుత్ వినియోగం పెరుగుతూ నెలవారీ బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయి. దీంతో ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు బకాయిలు పేరుకుపోతున్నాయి. సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తే సొంత వినియోగంతో బిల్లుల భారం తప్పనుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, వసతిగృహాలకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ కరెంట్ బకాయిలు తగ్గనున్నాయి. కరెంట్‌కోతల ఇబ్బందులు కూడా లేకుండా ఉండనున్నాయి.

ఘనంగా శ్రావణ పౌర్ణమి జాతర



సత్యనారాయణ వ్రతాలు నోముతున్న భక్తులు



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న దివాకర్‌రావు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు..
- సామూహిక సత్యనారాయణవ్రతాలు..

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం శ్రావణపౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 196 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణాలు రద్దీగా కనిపించాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూశారు. సత్యనారాయణస్వామిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడుకుందాం

- రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి
- దండేపల్లిలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు



ఆదివాసీ జెండా ఆవిష్కరిస్తున్న తిరుపతి

దండేపల్లి: ఆదివాసీల హక్కులను కాపాడుకోవాలని రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లిలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాళ్లపేటలో కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి దండేపల్లి వరకు ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. దండేపల్లి అంగడిబజారులో ఆదివాసీ జెండాను తిరుపతి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, ఆదివాసీ సంఘాల నాయకులు రాంపటేల్, సోము, కాంతరావు, జలపతి, అర్జున్, రవి, అనంత్, నరేందర్, కిషన్, విక్రమ్, ఎల్లయ్య, లాల్‌సాబ్, రాజేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దెరాగిడిలో భారీ చోరీ

- 40తులాల బంగారం, ఐఫోన్ అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సై

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గద్దెరాగిడిలో శుక్రవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సింగరేణి కార్మికుడి ఇంట్లో 40 తులాల బంగారం, ఐఫోన్ అపహరించుకెళ్లారు. బాధితుల కథనం ప్రకారం.. భూపాలపల్లిలో సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్న మేకల రాజయ్య గద్దెరాగిడిలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టారు. వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి, ఇతర శుభకార్యాలు ఉండడంతో గురువారం ఇక్కడికి వచ్చారు. రాజయ్య దంపతులతోపాటు సమీప బంధువు సింధు, శ్రీనివాస్ దంపతులు కూడా వచ్చారు. రాజయ్య భార్య స్వరూపకు చెందిన 30తులాల బంగారు ఆభరణాలు, ఆమె చెల్లి కూతురు సింధు, శ్రీనివాస్ దంపతులకు చెందిన 10 తులాల బంగారు ఆభరణాలు వేర్వేరు పర్సుల్లో పెట్టి నిద్రకు ఉపక్రమించారు. కాగా, రాత్రి మూడు గంటల ప్రాంతంలో రాజయ్యకు మెలకువ వచ్చి చూడగా పర్సులు చిందరగా పడి ఉన్నాయి. బంగారు ఆభరణాలు, ఐఫోన్ చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఆర్‌కేపీ ఎస్సై రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించి.. ఇంటి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నూతన ఇంటి కిటికీలకు గ్రిల్ లేకపోవడంతో దొంగలు లోనికి ప్రవేశించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. చోరీ ఘటన పరిసర ప్రాంతాల్లో కలకలం రేపింది.

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని అంతర్రాష్ట్ర వంతెన సమీపంలోని ప్రాణహిత నదిలో నుంచి శనివారం తెల్లవారు జామున ఇసుక తరలిస్తున్న రెంటు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. వెలమపల్లికి చెందిన గోనె సత్యనారాయణ, మానిశెట్టి ప్రశాంత్‌తో పాటు డ్రైవర్లు అట్టెల వెంకటేశ్, జగన్‌పై కేసు నమోదు చేసి వాహనా లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

సోన్: వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన సంఘటన శనివారం మండలంలోని న్యూ వెల్మల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపు సాయవ్వ తన ఇంటి ముందు నిద్రపోతుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో తల, మెడపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోతుల బారి నుండి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన యువతి (25) తల్లి మందలించడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో వ్యభిచారం గృహంపై శనివారం దాడి చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన చేతన్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో ఓ ఇంటిని కొన్ని నెలల క్రితం నుంచి అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆ ఇంటికి పలువురు పురుషులు, మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అనుమానం కలిగిన కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఆ గృహంపై దాడి చేసి చేతన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో



చెట్ల పొదల్లో ఆటో

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిత వనం పార్కు సమీపంలో చెట్ల పొదల్లోకి ఆటో దూసుకెళ్లి బోల్తా పడింది. సిర్పూర్ మండలం చిలాటిగూడకు చెందిన ప్రయాణికులు మహారాష్ట్రలోని మహూర్ గ్రామానికి దైవదర్శనం కోసం ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం మావల సమీపంలో ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దేవ్‌రావు, మారుతి, మంగావతి, నాగోబాయికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ కిషన్, పైలట్ ముజఫర్ క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

తండాల్లో తీజోత్సవం

- గిరిజన గ్రామాల్లో మొదలైన సందడి
- పెళ్లికాని యువతులు నిర్వహించే పండుగ



గోధుమ నారుకు నీళ్లు చల్లుతున్న యువతులు

కెరమెరి : తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ. గిరిజన యువతులు తమ ఆశలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించుకునే ఉత్సవం. ఆటపాటలు, విందులు, వినోదాలు, వినూత్న ఆచారాలతో బతుకమ్మ తరహాలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ వేడుకలు గిరిజన బంజారా (లంబాడా) తండాల్లో రక్షాబంధన్‌కు ప్రారంభమై కృష్ణాష్టమికి ముగుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వేడుకల్లో నిమగ్నం..

గిరిజన లంబాడాలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్' పండుగ జరుపుకోవడంలో నిమగ్నమయ్యారు. యువతులు కుల దేవతలను కొలుస్తూ బుట్టల్లో ఎర్రమట్టి నింపి అందులో గోధుమలు చల్లారు. వీటినే తీజ్ బుట్టలు అంటారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'తీజ్ భరాయిరో' అని పిలుస్తారు. ఆ రోజు నుంచి యువతులంతా నియమ నిష్ఠలు పాటిస్తున్నారు. గ్రామ ప్రజలకు మంచి జరగాలని, తమకు మంచి భర్త రావాలని కోరుకుంటూ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రతీరోజు మూడు పూటలా సమీపంలోని బావుల వద్దకు వెళ్లి నీటిని తీసుకువచ్చి బుట్టలపై చల్లుతున్నారు. ఆరు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

ఎనిమిదో రోజు 'ఘంగోర్' వివాహం

ఎనిమిదో రోజు యువతులంతా చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టితో ఆడ, మగ బొమ్మలను తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చీతో వేషధారణ చేస్తారు. వాటిని మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటుకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు ఘనంగా వివాహం జరిపిస్తారు. అక్కడే లాప్సీ (పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ' అంటే వారి కులదేవత 'మేరామయాడి' అని 'గోర్' అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

ఏడో రోజు 'ఢమోళీ' సందడి

ఏడో రోజున ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేస్తారు. వాటిని బెల్లం, నెయ్యితో కలుపుతారు. ఈ మిశ్రమాన్నే చూర్మా అంటారు. ఈ చూర్మాను తీజ్ బుట్టలున్న ఇంటి ఆవరణలో నెలకొల్పిన కుల దేవుడు 'సేవాభయ్య'కు నైవేద్యంగా సమర్పిస్తారు. అదే రోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు, వాటి ముందు నీళ్ల కడవ ఉంచి అందులో వేప మండలు పేరుస్తారు. ఆ కడవ ముందు జొన్నపిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామయాడి' తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజలు చేస్తారు. మేరామయాడి దేవత మాంసాహారి కావడంతో ఆమెకు మేకపోతును బలిస్తారు. ఆరోజు రాత్రి యువతులు ఇంటింటికీ వెళ్లి చూర్మా సేకరిస్తారు. వర్షాసైన వారికి పూస్తూ నృత్యం చేయడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ కోలాహల ప్రక్రియనే 'ఢమోళీ'గా వర్ణిస్తారు.

తొమ్మిదో రోజు..

తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. ఆ రోజు యువతులంతా ఇంటింటికీ వెళ్లి తీజ్‌లను తెంపడానికి అందరూ రావాలని ఆహ్వానిస్తారు. వారంతా వచ్చిన తర్వాత మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్' నారును తెంపుతారు. దానిని వరుసగా కూర్చున్న మగవారి తలపాగలో పెడతారు. ఆడవారైతే కొంగుకు కట్టుకుంటారు. మరికొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయలు దేరుతారు. సమీపంలోని చెరువులు లేదా బావుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ రోజు ప్రక్రియను 'తీజ్ ఎరాయోరో' పిలుస్తారు. దీనిని ఒకరకంగా లంబాడీ బతుకమ్మగా కూడా భావిస్తారు. గోర్‌బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారవుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

సంతోషంగా..



శ్రావణమాసంలో నిర్వహించే తీజ్ పండుగంటే మాకు ఎంతో ఇష్టం. బుట్టల్లో ఉన్న గోధుమలకు తొమ్మిది రోజులు నీళ్లు చల్లి చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడం వల్ల అన్నికార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతున్నారు. పాడి పంటలతో పాటు ఇంటిల్లిపాది, గ్రామస్తులు సుఖశాంతులతో ఉంటారు.

– జే.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

ఈవో కార్యాలయం ప్రారంభం



కార్యాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: బాసర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయ కార్యనిర్వహణాధి కారి కార్యాలయాన్ని శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గోమాతతో భవన ప్రవేశం, వాస్తుపూజ, మహా హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి నుంచి నూతన కార్యాలయంలో అధికారులంతా విధులు నిర్వహిస్తారని ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు, పీఆర్‌వో నారాయణ పటేల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం..

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని దస్నాపూర్ కాలనీలో శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించడంతో భయాందోళన చెందిన స్థానికులు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారి సిబ్బందిని అప్రమత్తం చేసి కాలనీకి పంపించారు. జిల్లా అటవీశాఖ అధికారి సీసీ ఇసాక్ ఆధ్వర్యంలో బీట్ అధికారులు కిషోర్, ఎం.వెంకటేష్, మారుతి, పి.వెంకటేష్ గంటపాటు శ్రమించి దానిని ఒక సంచిలో బంధించి అటవీప్రాంతంలో వదిలేశారు. సమయానికి స్పందించిన అటవీ శాఖ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కంటెయినర్‌ను ఢీకొని యువకుడి మృతి

- రాఖీ కట్టించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం
- బాసరలో పండుగపూట విషాదం



సాయిబాబు (ఫైల్)

బాసర/నవీపేట: రాఖీ పండుగను పురస్కరించుకుని ఓ సోదరుడు అక్కతో రాఖీ కట్టించుకొని స్కూటీపై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయినాథ్, కవిత దంపతులకు కుమార్తె సాయిప్రియ, కుమారుడు సాయిబాబు అలియాస్ బబ్లూ (19) ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం బబ్లూ నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్‌లో ఉంటున్న కవిత వద్దకు చిన్నాన్న కుమారుడైన అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా అబ్బాపూర్(ఎం)–జగ్గారావు ఫారమ్ మధ్యలో ముందుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బబ్లూ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నిర్మల్‌రూరల్: చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీకి చెందిన మహేష్ తనకు వరుసకు చెల్లెళ్లు అయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టించుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ముగ్గురు ఎగిరి కిందపడడంతో మహేష్, అర్చనకు తీవ్రంగా ఆద్యకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అందుబాటులో లేకపోవడంతో ట్రాలీలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్చన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలలో శోధిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషయం తెలుసుకుని..దాతృత్వం చాటి..



రక్తదానం చేస్తున్న సాయిరాహుల్

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ రూరల్ మండలం చిట్యాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన అర్చనను జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం జరగడంతో 'ఎ' నెగిటివ్ రక్తం అవసరమైంది. అరుదుగా లభించే ఈ రక్తగ్రూపు కోసం సామాజిక మాధ్యమాల్లో చేరవేయగా విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన బండారి సాయిరాహుల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. సమయానికి రక్తదానం చేసిన యువకుడిని పలువురు అభినందించారు..


నిర్మలం.. హృదయ రంజితం



గండిరామన్న హరిత పార్కు చుట్టూ పచ్చదనంతో అటవీ ప్రాంతం

ప్రకృతి శోభకు పెట్టింది పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఈ అడవుల్లో ఉన్న చెట్లకు ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చగా ఆకులు చిగురించి ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. నిర్మల్ జిల్లా పరిసరప్రాంతాల ప్రజల హృదయాలను రంజింపజేస్తున్న ఈ ప్రకృతి చిత్రాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జిల్లా కేంద్రం శివారులో పచ్చదనంతో అటవీ ప్రాంతం



ఆదివాసీ సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా ఆదివాసీ దినోత్సవం



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



డప్పుచప్పుళ్లతో కలెక్టర్, ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు హాజరయ్యారు. ముందుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీతో కలిసి భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రపంచ ప్రసిద్ధి పొందాయన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా పీవీటీజీ గిరిజనులు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా 180 అంబులెన్స్‌లను పీవీటీజీ గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. పీవో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పీవీటీజీ గిరిజనులకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా విద్య, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదివాసీల సంప్రదాయ బద్ధమైన పూజలు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాలతో కుమురంభీం ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, సర్‌మేడీలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో..

మండల కేంద్రంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆదివాసీ నాయకులు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన మోర సాయి (32) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితం అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార నిందితుడి గాలింపునకు ప్రత్యేక బృందాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీచౌక్‌లో 78 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి కోసం వన్ టౌన్ పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్ర వాసిగా అనుమానిస్తున్న నిందితుడు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ వైపు వెళ్లి ట్రెయిన్‌లో పరారైనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సీసీ పుటేజీలో నిందితుడి కదలికలను గమనించినట్లుగా ఆయన పేర్కొన్నారు

నాగోబాకు నొవోంగ్ పూజలు



పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా మురాడి వద్ద మెస్రం వంశీయులు శనివారం నొవోంగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మెస్రం వంశ పెద్దలు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన చిరు ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి నాగోబాకు సమర్పించారు. అనంతరం తమ గ్రామాలకు వెళ్లి నొవోంగ్ పూజలు చేయనున్నట్లు తెలిపారు. నొవోంగ్ పూజల చేస్తేనే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన చిరుధాన్యాలను తెంపడం జరుగుతుందని మెస్రం వంశ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, హనుమంత్‌రావ్, దేవ్‌రావ్, లింబారావు, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన: పోరాటాల ద్వారానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇప్పటి వరకు డైరెక్టర్ స్థాయి అధికారులతో కమిటీ సమావేశాలు జరిపినా కార్మికులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మాఫీ వంటి దీర్ఘకాలిక సమస్యలను ఎన్నికల్లో గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికై 18 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. యాజమాన్యంతో ములాఖత్ అయి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని, ఇచ్చిన హామీలపై గనులపై నిలదీయాలని పిలుపునిచ్చారు. జూలై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్మికులందరికీ రీ మెడికల్ నిర్వహించి అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, ఏరియా కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్లు ఎస్‌కే ఇనూస్, మరిశెట్టి దత్తు, పిట్ కార్యదర్శి ఎండీ ఆరీఫ్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు తిరుపతి, బాలేష్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెంకు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 1,707 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. – కడెం